BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 04 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## టిప్పర్ అతివేగమే కారణం

- టీజీఎస్ఆర్టీసీ ప్రాథమిక విచారణలో వెల్లడి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

చేవెళ్ల రోడ్డు ప్రమాద ఘటనను దురదృష్టకరమైనదిగా టీజీఎస్ఆర్టీసీ పేర్కొంది. ప్రాణాలు కోల్పోయిన 19 మంది కుటుంబాలకు తమ సంతాపం తెలియజేసింది. క్షతగాత్రులైన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలనీ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. సోమవారం తెల్లవారుజామున 4.40 గంటలకు తాండూరు నుంచి బయలుదేరిన ప్రయివేటు హైర్ బస్సు (పీఎన్‌బీ) ఎక్స్‌ప్రెస్ బస్సు (టీఎస్34 టీఏ 6354) ఇందిరానగర్ సమీపంలో కంకర లోడ్‌తో ఎదురుగా వచ్చిన టిప్పర్ (టీజీఎస్06ఆ 3879) బస్సు ముందుభాగాన్ని బలంగా ఢీ కొట్టింది. టిప్పర్ అతివేగంగా ఢీ కొట్టడంతో బస్సు ముందు భాగంతో పాటు ఎడమవైపు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఢీ కొట్టిన టిప్పర్, బస్సు వైపు ఒరిగిపోయి అందులోని కంకర ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక ఎక్కువ మంది ప్రయాణికులతో పాటు బస్సు డ్రైవర్ దస్తగిరి చనిపోయారు. ఈ దుర్ఘటనలో క్షతగాత్రులైన వారిని హుటాహుటిన అక్కడికి సమీపంలో చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి, వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చేవెళ్ల ఘటన జరిగిన వెంటనే టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం స్పందించి సమీపంలోని డిపో మేనేజర్లను అప్రమత్తం చేసింది. వెంటనే తాండూరు, వికారాబాద్, పరిగి డిపో మేనేజర్లు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలకు పూనుకున్నారు.

### నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల

## ప్రాజెక్టులపై గత ప్రభుత్వం వివక్ష



బలగం టీవీ,మహబూబ్‌నగర్

"బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రాజెక్టుల పట్ల వివక్ష చూపారు. ఏడాదికి కిలోమీటర్ సొరంగం తవ్వినా ఎస్ఎల్‌బీసీ ద్వారా నల్లగొండ ఫ్లోరైడ్ బాధితులకు తాగు, సాగునీరు అందే ది. నాడు కాంగ్రెస్ మొదలుపెట్టిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తే ఆ పార్టీకి మంచి పేరు వస్తుందన్న కపట బుద్ధితో ఎస్ఎల్‌బీసీతో పాటు కేఎల్ఐ బీమా, కోయిల్‌సాగర్, నెట్టంపాడు ప్రాజెక్టు లను గత సీఎం పూర్తి చేయలేదు. కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు వ్యయం పెరిగింది.." అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి దగ్గర ఎస్ఎల్‌బీసీ పనుల పునరుద్ధరణ కోసం హెలికాప్టర్ మ్యాగ్నెటిక్ సర్వే పనులను సోమవారం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రారం భించారు. ఆయన వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నారు. అనంతరం మన్నెవా రిపల్లిలో మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు.

30 టీఎంసీల తరలింపుతో 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 1983లో ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు మంజూరైందన్నారు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ చివరికి ఉమ్మడి రాష్ట్రంలో 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో టన్నెల్-1, టన్నెల్-2 పనులను రూ.1968 కోట్లతో ప్రారంభించారని గుర్తు చేశారు. టన్నెల్ బోర్‌మిషన్‌ను దేశంలోనే తొలిసారి ఎస్ఎల్బీసీ టన్నెల్‌కు ఉపయోగించారని తెలిపారు. 2014 వరకు 30 కిలోమీటర్లు పూర్తయితే.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదన్నారు. ఏడాదికి కిలోమీటర్ తవ్వినా పదేండ్లలో ఈ ప్రాజెక్టు పూర్తయి ఫ్లోరైడ్ బాధితులకు తాగునీరు, బీడు భూములకు సాగునీరు అందేదని అన్నారు. రాజకీయ దురుద్దేశంతో ఆ నాటి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కకు పెట్టి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. గ్రావిటీ ద్వారా నల్లగొండకు నీళ్లు తీసుకెళ్లాలనుకుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో 40కి.మీ టన్నెల్ ఎక్కడా లేదని, అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ప్రాజెక్టును రెండేండ్లలో పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామని చెప్పారు. ఇది పూర్తయితే తెలంగాణకు ఆ రికార్డు దక్కుతుందన్నారు. ఆనాడు రూ.2 వేల కోట్ల ఖర్చుతో ఈ ప్రాజెక్టు పూర్తయ్యేదని, బీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్ల ఇప్పుడు పెరిగిన అంచనాలతో రూ.4600 కోట్లకు పెరిగిందని అన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయకపోవడమేకాదు.. అనేక ఆటుపోట్లను దాటుకుంటూ తాము అధికారం లోకొచ్చాక మళ్లీ పనులు మొదలు పెట్టామని తెలిపారు. గుట్టలలో ఉన్న పొరల కారణంగా పలచటి మట్టి రావడంతో జరిగిన ప్రమాదంలో దురదృష్ట వశాత్తు ఎనిమిది మంది కార్మికులు చనిపోయారన్నారు. ఆ కుటుంబాలను ఆదుకుని పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. కేసీఆర్ పదేండ్ల కాలంలో రూ.లక్షా 86 వేల కోట్లు కాంట్రాక్టర్లకు ప్రాజెక్టుల నిర్మాణంలో ముట్టజెప్పారని ఆరోపించారు. అందులో లక్షా 5 వేల కోట్లు కాళేశ్వరం కోసమే ఖర్చు చేసినా.. ఎకరా కూడా తడపలేదని విమర్శించారు.

### మీర్జాగూడ వద్ద

# మరణమృదంగం

- రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆర్టీసీ బస్సుపై లారీ దూసుకెళ్లి 19 మంది దుర్మరణం
- మృతుల్లో పసికందు, మహిళలు
- ప్రమాద సమయంలో బస్సులో 72 మంది
- మృతుల్లో ఎక్కువ మంది వికారాబాద్ జిల్లా తాండూరు వాసులే..
- ముగ్గురు అక్కాచెల్లెళ్లు, భార్యాభర్తలు, తల్లి బిడ్డలు మృతి
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన




బలగం టీవి, చేవెళ్ల

రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పలువురి ప్రాణాలను బలితీసుకుంది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఢీకొన్న లారీపై ఉన్న కంకర మొత్తం బస్సుపై పడటంతో ప్రయాణికులు బస్సులోనే కూరుకుపోయారు.ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ దారుణ ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 72 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ఎక్కువగా విద్యార్థులు, ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం.

ఆదివారం సెలవు కాగా సోమవారం ఉదయమే తమ ఇళ్ల నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రమాదం వల్ల హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చేవెళ్ల-వికారాబాద్ రూట్‌లో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ప్రమాద స్థలంలో పోలీసులు, ఫైర్‌సిబ్బంది హుటాహుటిన సహాయక చర్యలు ప్రారంభించారు. మూడు జేసీబీల సాయంతో కంకరలో కూరుకుపోయిన ప్రయాణికులను బయటకు తీయడం కొనసాగుతోంది. ఇప్పటి వరకు 15 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటకు తీసినట్లు సమాచారం. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సహాయక చర్యల సందర్భంగా చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌కు ప్రమాదం జరిగింది. జేసీబీ యంత్రం ఆయనపైకి ఎక్కడంతో ఆయన ఎడమ కాలికి గాయమైంది. ఆయనను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాద వార్త తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ, గాయపడిన వారికి ఉత్తమ వైద్యం అందించాలంటూ అధికారులను ఆదేశించారు.

బస్సులో చిక్కుకున్న ప్రయాణికులను అతికష్టం మీద బయటకు తీశారు. 18 మృతదేహాలను గుర్తించారు. కొన ఊపిరితో ఉన్న ఓ వ్యక్తి చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాణాలు విడిచారు. తీవ్రంగా గాయపడిన 24 మందిని చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి, వికారాబాద్ జిల్లా ఆస్పత్రికి, హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 72 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వికారాబాద్, తాండూర్, హైదరాబాద్ ఆస్పత్రులకు చెందిన వైద్య సిబ్బందితో పోస్టుమార్టం నిర్వహించారు. ఆ తర్వాత మృతదేహాలను బంధువులు, కుటుంబ సభ్యులకు అందజేశారు. అంత్యక్రియలు నిర్వహించారు. దుర్ఘటన విషయం తెలియగానే రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆస్పత్రుల్లో క్షతగ్రాతులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందేలా ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యలు చేపడుతున్న క్రమంలో జేసీబీ పైకి దూసుకురావడంతో చేవెళ్ల సీఐ కాలుకి గాయమైంది. దుర్ఘటన జరిగిన హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి



బలగం టీవి, చేవెళ్ల

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం అనేక కుటుంబాలను శోకసంద్రంలో ముంచేసింది. ఈ ఘటనలో తాండూరుకు చెందిన డ్రైవర్ యెల్లయ్య గౌడ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన ముగ్గురు కుమార్తెలు తనూషా, సాయి ప్రియా, నందిని ముగ్గురు హైదరాబాదులో చదువుతున్న కళాశాల విద్యార్థినులు. వీరు వారాంతంలో తాండూరులో జరిగిన ఒక వివాహానికి వచ్చి, సోమవారం ఉదయం హైదరాబాద్‌కు బయలుదేరారు."వారిని రాకూడదని నేనే అన్నాను. కానీ తల్లి పిలిచింది. బస్సు కండిషన్ బాగోలేదని ఎవరో చెప్పారు, అయినా పంపేశాను. ఒకరిని కాదు, ముగ్గురినీ కోల్పోయాను. నేను ఇక ఎలా బతుకుతాను?" అంటూ యెల్లయ్య గౌడ్ విలపించారు.

తాజాగా పెద్ద కుమార్తె అనూష వివాహం జరిపిన ఈ కుటుంబం, ఒక్కసారిగా శోకంలో మునిగిపోయింది. ఇదే ప్రమాదంలో మరో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. సాలిహా బేగం (33) అనే మహిళ తన మూడునెలల బిడ్డతో కలిసి హైదరాబాద్‌లోని తాతమామలను కలవడానికి వస్తుండగా ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయింది. రక్షణ సిబ్బంది శిథిలాలను తొలగించే క్రమంలో సాలిహా తన బిడ్డను గట్టిగా కౌగిలించుకుని ప్రాణాలు విడిచినట్లు గుర్తించారు. ఆ దృశ్యం చూసి అక్కడ ఉన్నవారంతా కంటతడి పెట్టారు.

మరో బాధాకర ఘటనలో ఎన్. హనుమంతు అనే వ్యక్తి రైలును మిస్ అవడంతో ఆర్టీసీ బస్సులో ప్రయాణం కొనసాగించాడు. కానీ ఆ నిర్ణయమే ప్రాణాంతకమైంది. ఆయన వెనుక 10 ఏళ్ల కుమారుడు వివేక్ కన్నీరుమున్నీరు అవుతూ ప్రమాద స్థలంలో విలపించాడు.



### నా ప్రగాఢ సానుభూతి: రాష్ట్రపతి ముర్ము

'బస్సు ప్రమాదంలో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నా. గాయపడిన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా'

### ప్రాణనష్టం కలిచివేసింది: ప్రధాని మోడీ

'బస్సు ప్రమాద ఘటనలో పలువురి ప్రాణనష్టం కలిచివేసింది. ఈ క్లిష్ట సమయంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి. మరణించిన ప్రతి ఒక్కరి కుటుంబానికి పీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా అందిస్తాం'

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. అధికారులు వెంటనే ఘటనాస్థలికి వెళ్లి సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌కు, పోలీసులు మరియు ఫైర్ సిబ్బందికి అన్ని రకాల సహకారం అందించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీతో టెలిఫోన్‌లో మాట్లాడి ప్రమాద పరిస్థితులపై సమాచారం తీసుకున్నారు. ప్రమాద స్థితిగతులు ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. "క్షతగాత్రులను వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించి, అవసరమైతే హైదరాబాద్‌కు తరలించి ఉత్తమ వైద్యం అందించాలి," అని సీఎం పేర్కొన్నారు. అలాగే, ప్రమాదస్థలంలో ఉన్న మంత్రులు తక్షణమే చేరుకుని సహాయక చర్యలను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సీఎం సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## అఫ్ఘానిస్థాన్‌ను మళ్లీ వణికించిన భూకంపాలు

- 20 మంది మృతి,
- 500 మందికి పైగా గాయాలు



బలగం టీవీ, కాబూల్

అఫ్ఘానిస్థాన్‌ను మరోసారి భూకంపాలు వణికించాయి. ఈ ఉదయం ఉత్తర అఫ్ఘానిస్థాన్‌లోని మజార్-ఇ-షరీఫ్ నగరం సమీపంలో రిక్టర్ స్కేల్‌పై 6.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ విపత్తులో కనీసం 20 మంది మృతి చెందగా, 534 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భూకంపం ధాటికి అనేక గ్రామాలు శిథిలాలమయమయ్యాయి. పలు కుటుంబాలు కకావికలమయ్యాయని, ఇంకా అనేక మంది శిథిలాల్లో చిక్కుకున్నట్లు వెల్లడించారు. మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

జియోలాజికల్ సర్వే తెలిపిన వివరాల ప్రకారం, భూకంప కేంద్రం మజార్-ఇ-షరీఫ్‌కు 28 కిలోమీటర్ల దూరంలో, భూమికి 28 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు తెలిసింది. భూప్రకంపనలు తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్, తుర్కెమెనిస్థాన్ దేశాల్లోనూ అనుభవించబడ్డాయి. ప్రమాద ప్రభావం కారణంగా మజార్-ఇ-షరీఫ్, బాల్, సమంగాన్ ప్రాంతాల్లో అధికారులు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. భూకంపం ధాటికి పలు ఇళ్లు కూలిపోవడంతో భారీ ఆస్తినష్టం సంభవించినట్లు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది.

గత ఆగస్టులో సంభవించిన భారీ భూకంపంలో 2,200 మందికి పైగా మృతి చెందగా, 3,000 మంది గాయపడినట్లు గుర్తుచేశారు. ఆ విపత్తులో ఆరు గ్రామాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి.

#### మయన్మార్‌లో 4.5 తీవ్రతతో భూకంపం

అఫ్ఘానిస్థాన్‌తో పాటు మయన్మార్‌లోనూ భూమి కంపించింది. ఉదయం 7.03 గంటల సమయంలో 4.5 తీవ్రతతో భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సెస్మోలజీ ప్రకటించింది. ఈ భూకంప కేంద్రం భూమికి 90 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు తెలిపింది. అంతకుముందు శనివారం కూడా 4.2 తీవ్రతతో భూకంపం సంభవించిందని అధికారులు వెల్లడించారు.

## మరొకసారి కాంగ్రెస్‌కు ఛాన్స్ ఇవ్వద్దు




- ఒక ఛాన్స్ ఇచ్చి మోసపోయాం
- కంటోన్మెంట్‌లో చేయని అభివృద్ధి, జూబ్లీహిల్స్‌లో ఎలా చేస్తారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణకు మళ్లీ కాంగ్రెస్‌కు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వకూడదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. బోరబండలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడిన ఆయన, "ఒక్క ఛాన్స్ ఇచ్చినా రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశాడు, తెలంగాణను పాతాళానికి లాక్కెళ్లాడు" అని తీవ్రంగా విమర్శించారు. కేటీఆర్ మాట్లాడుతూ, "ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకే నంబర్‌వన్‌గా ఉన్న తెలంగాణ చివరి స్థానానికి చేరింది. ఆటో డ్రైవర్లు, యువత ఆత్మహత్యలకు Congress పాలన కారణమైంది" అన్నారు.హైదరాబాద్ అభివృద్ధిని నిలిపేసి, రియల్ ఎస్టేట్ రంగాన్నీ పతనం చేశారని మండిపడ్డారు. "ఇప్పుడు మళ్లీ ఏ ముఖం పెట్టుకొని మరో ఛాన్స్ అడుగుతున్నావు రేవంత్?" అని నిలదీశారు.

"కంటోన్మెంట్‌లో ఒక్క పైసా ఇవ్వని ప్రభుత్వం ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి చేస్తామంటోంది. ప్రజలను మోసం చేయడం కోసం మాత్రమే కాంగ్రెస్ మళ్లీ మాటలు చెబుతోంది. కానీ ప్రజలు మళ్లీ నమ్మరు" అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ నేతలు హింసకు దిగుతున్నారని, ప్రజలను బెదిరిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఎవరైనా బెదిరింపులకు దిగితే బాధితులకు అండగా ఉంటాం, రౌడీల సంగతి తేలుస్తాం," అని హెచ్చరించారు.

'రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో ఒక నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప ఇంకేమీ చేయలేదు" అని కేటీఆర్ ఆరోపించారు. "రాహుల్ గాంధీకి వందల కోట్లు పంపే ధైర్యం ఉంది కానీ పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే నిధులు లేవు" అని ఎద్దేవా చేశారు.

"హైదరాబాద్‌లో కేసీఆర్ పాలనలో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాం, కానీ రేవంత్ ప్రభుత్వం వేలాది ఇళ్లు కూలగొట్టి ప్రజలను రోడ్డుపైకి లాగింది. ఈ బుల్డోజర్ ప్రభుత్వం పేదల ఇంటి పైకి రాకూడదంటే కారు గుర్తుపై ఓటు వేసి మాగంటి సునీతను గెలిపించాలి," అని పిలుపునిచ్చారు."ఈ ఎన్నిక కారు గుర్తు %-% బుల్డోజర్ గుర్తు మధ్య జరుగుతున్న యుద్ధం. ప్రజలు కాంగ్రెస్‌కి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చింది," అని కేటీఆర్ తెలిపారు.

## జూబ్లీహిల్స్‌లో మేమే కింగ్

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




బలగం టీవి, హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో మేమే కింగ్ అవుతామని, కింగ్ మేకర్స్ అయ్యే దశ దాటిపోయిందని కేంద్ర మంత్రి జీ. కిషన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన, "ఈ సారి జూబ్లీహిల్స్‌లో ప్రజల తీర్పు స్పష్టంగా మోదీ నాయకత్వానికి అనుకూలంగా వస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు.

"జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో టీడీపీ శ్రేణులు కూడా ఎన్డీయే భాగస్వామిగా మాతో కలిసి పనిచేస్తున్నాయి. జనసేన, టీడీపీ శ్రేణులు స్వచ్ఛందంగా ఎన్నికల్లో పనిచేస్తున్నాయి. ఎవరికి వారు గెలవాలని కోరుకోవడం తప్పు కాదు, కానీ విమర్శలు పరిమితి దాటకూడదు," అని కిషన్‌రెడ్డి అన్నారు. "జూబ్లీహిల్స్ ఎన్నికలను కొందరు పాకిస్థాన్‌తో లింక్ చేసి మాట్లాడుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి తగదు. రాష్ట్ర ప్రభుత్వం బియ్యం అంశాన్ని కూడా రాజకీయంగా వాడుతోంది. ఒక్క కిలో సన్న బియ్యంలో 42 రూపాయలు కేంద్రం నుంచి వస్తాయి, రాష్ట్రం వాటా కేవలం 16 రూపాయలు మాత్రమే," అని గుర్తు చేశారు."దేశంలోని అన్ని బైఎలక్షన్లకు ఒకేరోజు అభ్యర్థుల ప్రకటన చేశాం. జూబ్లీహిల్స్‌లో మేము ముందుకు వెళ్తున్నాం. మాకు సర్వేలు అవసరం లేదు. నేరుగా ఓటర్లను కలుస్తున్నాం. ప్రతి బూత్‌కు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం," అని తెలిపారు. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడంపై కిషన్‌రెడ్డి స్పందిస్తూ, "ముస్లింలపై ప్రేమతో అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారా? అంత ప్రేమ ఉంటే ఆయనకే టికెట్ ఎందుకు ఇవ్వలేదు?" అని ప్రశ్నించారు.

## ప్రైవేట్ రంగ పరిశోధనలకు రూ.లక్ష కోట్లు

- ప్రధాని మోడీ



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

దేశ శాస్త్ర సాంకేతిక రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కీలక నిర్ణయం ప్రకటించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపం వేదికగా సోమవారం ప్రారంభమైన లిలిఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌లో మాట్లాడుతూ, ప్రైవేట్ రంగంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రూ.లక్ష కోట్ల నిధిని వినియోగించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధాని భారత క్రికెట్ జట్టును వన్డే ప్రపంచకప్ విజయం సాధించినందుకు, అలాగే ఇస్రో భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించినందుకు అభినందించారు. "ఇది శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన కార్యక్రమం అయినప్పటికీ, ముందుగా భారత్ క్రికెట్ జట్టు సాధించిన అద్భుత విజయాన్ని ప్రస్తావించక మానలేను. ఈ విజయం దేశ యువతకు స్ఫూర్తి నిస్తోంది" అని మోదీ అన్నారు."ఈ లక్ష కోట్లు నా దగ్గర ఉండవు. ఇవి మీ కోసం ం శాస్త్రవేత్తల కోసం, పరిశోధకుల కోసం," అని ప్రధాని పేర్కొన్నారు. ఈ నిధి ప్రైవేట్ రంగంలో ఉన్న ఆవిష్కరణాత్మక ప్రాజెక్టులను ప్రోత్సహిస్తుందని, కొత్త అవకాశాలను తెరవగలదని వివరించారు.

#### ఇస్రోకు మోదీ అభినందనలు

ఇటీవల ఇస్రో భారత చరిత్రలోనే అత్యంత భారీస్థాయి కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిందని గుర్తు చేస్తూ, "నిన్న భారత్ శాస్త్ర సాంకేతిక రంగంలో జెండా ఎగురవేసింది" అని మోదీ అన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషిని ఆయన ప్రశంసించారు.

#### పరిశోధనల్లో మహిళల పాత్ర పెరుగుతోంది

గత దశాబ్దంలో దేశంలో పరిశోధన వ్యయం రెట్టింపైందని, 'అనుసంధాన్ రీసెర్చ్ ఫౌండేషన్' స్థాపన ద్వారా విశ్వవిద్యాలయాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామని ప్రధాని తెలిపారు. "దశాబ్దం క్రితం మహిళలు దాఖలు చేసే పేటెంట్ల సంఖ్య వందకంటే తక్కువగా ఉండేది. ఇప్పుడు అది ఐదువేలకుపైగా పెరిగింది. భారత్‌లో ఎస్‌టీఈఎం విద్యను అభ్యసిస్తున్న వారిలో 43 శాతం మహిళలే ఉన్నారు. ఇది ప్రపంచ సగటు కంటే ఎంతో ఎక్కువ" అని వివరించారు.

ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు కలిసి 21వ శతాబ్దంలో కొత్త మార్గాలు చూపాల్సిన అవసరం ఉందని ప్రధాని పిలుపునిచ్చారు. దేశంలో ఆధునిక ఆవిష్కరణలకు అనుకూల వాతావరణం కల్పించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

"భారత్ హై రిస్క్, హై ఇంపాక్ట్ రీసెర్చ్ ప్రాజెక్టులకు మద్దతు ఇస్తోంది. సైన్స్, టెక్నాలజీకి శక్తి కేంద్రంగా మారడమే మా లక్ష్యం," అని మోదీ స్పష్టం చేశారు.

## పత్తి సేకరణపై ఆంక్షలొద్దు

- ఎకరాకు7 క్వింటాళ్ల పరిమితి సరిగాదు
- కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గి ఇప్పటికే పత్తిపై సుంకాలు ఎత్తేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు తాజాగా సీసీఐ ద్వారా పత్తికొనుగోళ్లపై ఆంక్షలు విధించడం సరిగాదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తినే కొనుగోలు చేస్తామని పరిమితి విధించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మిగతా పత్తి పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలని నిలదీశారు. ఐదేండ్లుగా లేని నిబంధనలు ఇప్పుడే ఎందుకు అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పత్తి రైతుల పట్ల శాపాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎంతో వ్యయప్రయాసలకోర్చి సీసీఐ పెట్టిన నిబంధనల ప్రకారం పత్తిని తీసుకువెళ్తుంటే ఇప్పుడు కొత్తగా ఎకరానికి ఏడు క్వింటాళ్ల పరిమితి అనడం కేంద్ర ప్రభుత్వం యొక్క ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని విమర్శించారు. సబ్సిడీ దిగుమతులకు కేంద్రం అనుమతించడం వలన మార్కెట్లో పత్తి రేటు రూ.6000 వరకు పడిపోయిందని తెలిపారు. సీసీఐ మీద భరోసాతో తీసుకొస్తున్న క్రమంలో సీసీఐ నుంచి రాష్ట్ర సర్కారుకు వచ్చిన లేఖ పత్తిరైతులకు ఆశనిపాతం లాంటిదేనని పేర్కొన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ స్టాటిస్టిక్స్ అంచనాల ప్రకారం తెలంగాణలో సరాసరి దిగుమతి 7 క్వింటాళ్లు కాబట్టి అంతే కొనుగోలు చేస్తామని ప్రకటించడం సహేతుకం కాదని తెలిపారు.నల్లరేగళ్ల ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని గుర్తుచేశారు. మిగతా పత్తిని రైతులు ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించారు. ఇటువంటి నిబంధనలతో రైతాంగాన్ని గోస పెట్టడం సరికాదని హితవు పలికారు. వెంటనే సీసీఐ అమల్లోకి తెచ్చిన కొత్త నిబంధనను తీసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దిగుమతి సుంకాలు ఎత్తివేయడంపై పునరాలోచన చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. 'అమ్మ పెట్టాపెట్టదు, అడుక్కోనివ్వదు' అన్న చందంగా కేంద్రం ఒకవైపు సుంకాలు ఎత్తివేసి, బహిరంగ మార్కెట్లో పత్తికి ధర పతనమయ్యేలా చేసిందీ, ఇంకోవైపు సీసీఐ ద్వారా సవాలక్ష కొర్రీలు పెట్టిందీ కేంద్రమేనని విమర్శించారు. తెలంగాణ పత్తి రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఎకరాకు 7 క్వింటాళ్ల నిబంధనను ఎత్తేసి పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలనీ, తేమశాతం 20 వరకు ఉన్నా పత్తిపంటను కొనుగోలు చేసేలా సీసీఐని ఆదేశించాలని డిమాండ్ చేశారు.

# పారదర్శకంగా చేప పిల్లల పంపిణీ

- 20వ తేదీ నాటికి లక్ష్యం మేరకు చేప పిల్లల విడుదల పూర్తి చేయాలి
- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి
- మత్స్యశాఖ పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన మంత్రి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాష్ట్రవ్యాప్తంగా జలవనరుల్లో చేప పిల్లల విడుదల పారదర్శకంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. మత్స్య శాఖపై రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

చేపల పంపిణీ టెండర్ల ఫైనల్ చేయడం, చేపల పంపిణీ పర్యవేక్షణ ఇతర శాఖల అధికారుల నియామకం, యాక్షన్ ప్లాన్ తయారీ తదితర అంశాల పై రివ్యూ నిర్వహించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నాటికి నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు నీటి వనరులలో చేప, రొయ్య పిల్లల




విడుదల పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి నీటి వనరుల్లో చేప పిల్లల విడుదల కార్యక్రమం వేగవంతం గా పూర్తి చేయాలని, ప్రస్తుత సమయంలో నీటి వనరులలో చేపలు విడుదల చేస్తేనే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు.

టీ–మత్స్య యాప్ లో చేప పిల్లల, సరఫరా దారుల, రవాణా చేసే వాహనం సంపూర్ణ వివరాలను మత్స్య శాఖ అధికారి పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. ప్రతి నీటి వనరుల దగ్గర ఎన్ని చేప పిల్లలు విడుదల చేస్తున్నామో వివరాలు తెలిసేలా బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. చేపల పంపిణీ కార్యక్రమాన్ని మత్స్య శాఖ అధికారులతో పాటు నీటి పారుదల శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఎంపీడీవో, జిల్లా పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు.చేపల పంపిణీ కార్యక్రమానికి ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులను ఆహ్వానిం చాలన్నారు. చేపల విడుదల సమాచారం సంబంధిత మత్స్యకార సంఘాల అధ్యక్షులు కార్యదర్శులకు అందించాలని, చేపల ఉత్పత్తి పెంచడంతో పాటు వాటి విక్రయానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ స్థలాలలో చేపల స్టాల్స్, ఫిష్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ఈ నెల 14 వ తేదీ వరకు చేప పిల్లల విడుదల కార్యక్రమం పూర్తి చేస్తామని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, జిల్లా నీటి పారుదల అధికారి కిశోర్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, డీపీఓ శర్ఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజావాణి అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి..

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజావాణికి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 149 అర్జీలు రాగా, వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఆయా శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని పరిష్కారమయ్యాయి? తదితర వివరాలపై ఆరా తీశారు. అన్ని దరఖాస్తులు ఆన్లైన్లో పూర్తిగా పరిష్కరించాలని పెండింగ్ పెట్టవద్దని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు బాధ్యులు తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని స్పష్టం చేశారు. మండలాల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇండ్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇతర అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాల పంపిణీకి ఎంపిక క్యాంప్ విజయవంతం..

- రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో ఘనంగా నిర్వహణ

**బలగం టీవీ, బోయినపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని దివ్యాంగులు మరియు వయోవృద్ధులకు ఉచితంగా ఉపకరణాలు, సహాయ పరికరాలను పంపిణీ చేసేందుకు అర్హుల ఎంపిక క్యాంపు బోయినపల్లి మండలంలో విజయవంతంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర హెూం శాఖా సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, వేములవాడ శాసనసభ్యులు, విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ల మార్గదర్శకత్వంలో, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశాల మేరకు ఈ క్యాంపు నిర్వహించారు.

జిల్లా సంక్షేమ అధికారిణి (డీడబ్ల్యూఓ) పి. లక్ష్మీరాజం మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలింకో సహకారంతో ఈ ఎంపిక కార్యక్రమం జరిగింది. అలింకో సంస్థ సిబ్బంది ఈ క్యాంపులో బ్యాటరీ ఆపరేటెడ్ సైకిల్స్, వీల్ చైర్స్, దృష్టి లోపం ఉన్నవారికి స్మార్ట్ ఫోన్లు, బధిరుల కోసం వినికిడి యంత్రాలు, అలాగే వయోవృద్ధుల కోసం వాకింగ్ స్టిక్స్ (చేతి కర్రలు), మోకాలి పట్టీలు, నడుము పట్టీలు వంటి సహాయక పరికరాల కోసం అర్హులను గుర్తించారు. ఈ క్యాంపు నందు దాదాపు 400 మంది దివ్యాంగులు మరియు వయోవృద్ధులు హాజరై తమ పేర్లను నమోదు చేసుకుని, అర్హత గల పరికరం కోసం దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ పి. లక్ష్మీరాజం, ఎంపీడీఓ జయశిల, సీడీపీఓ సౌందర్య, ఏసీడీపీఓ సుచరిత, రోజా, డి హబ్ కో ఆర్డినేటర్, ఇంచార్జ్ డీసీపీఓ అంజయ్య, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ స్రవంతి, అలింకో సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్వైజర్లు నిర్మల, శంకరమ్మ, అంగన్వాడీ టీచర్లు మరియు ఐసిపిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మత్స్య కార్మిక కుటుంబాల అభ్యున్నతే లక్ష్యం..



- జిల్లాలో 1కోటి48 లక్షల చేప పిల్లలు విడుదల చేస్తాం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- మల్కపేట రిజర్వాయర్ లో ఉచిత చేపపిల్లల విడుదల
- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మత్స్య కార్మిక కుటుంబాల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో మల్కపేట రిజర్వాయర్ లో ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మత్స్యకారులకు 100% సబ్సిడీతో ఉచిత చేప బిల్లలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహిస్తున్నారని తెలిపారు. చేపలను తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. మత్స్యకారులు అన్ని అవకాశాలను అందిపుచ్చుకోనికి ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని 456 చెరువుల్లో రూ. కోటి 78 లక్షల విలువైన 1కోటి 48 లక్షల చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నిర్వహించనున్నామని తెలిపారు. మల్కపేట రిజర్వాయర్లో మొత్తం 7 లక్షల 50 వేల చేపపిల్లలు పోసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. 80 నుంచి 100 ఎం ఎం సైజ్ ఉన్న 1,74,674 చేప పిల్లలు పోశారు. మత్స్య కారులకు ఉపాధి కల్పించేందుకు కేజ్ కల్చర్, ఇతర విధానాలు అమలు చేస్తామని వివరించారు.ఈ ప్రాంత అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. మల్కపేట రిజర్వాయర్ పనులను పూర్తి చేసి ఎల్లారెడ్డి పేట, కోనరావుపేట మండలంలోని గ్రామాల పొలాలకు సాగు నీరు విడుదల చేశామని గుర్తు చేశారు. మల్కపేట రిజర్వాయర్ పైకి వెళ్లే సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు.

జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మల్కపేట జలాశయంలో 7 లక్షల 50 వేలకు పైగా చేప పిల్లలను విడుదల చేయడానికి సన్నాహాలు చేయడం జరిగిందని తెలిపారు. 100 శాతం సబ్సిడీతో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని చెరువుల్లో వచ్చే 10 రోజుల్లోగా చేప పిల్లలను విడుదల చేస్తామని అన్నారు. దీనికోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మత్స్య కార్మికులు ఆర్థిక అభ్యున్నతి సాధించడం కోసం ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్, డీఏఓ అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## "దక్కన్ సర్కార్" సినిమా పాట రిలీజ్ చేసిన టీపీసీసీ అధ్యక్షుడు

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని గాంధీభవన్ లో సోమవారం రోజున సాయంత్రం ఐదు గంటలకు దక్కన్ సర్కార్ సినిమాలోని "ఎవడురా రాజ్యాన్ని ఏలుతున్నది" అనే పాటను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దక్కన్ సర్కార్ సినిమాలోని ఈ పాట చాలా అద్భుతంగా ఉంది.. తెలంగాణలో చాలామంది కళాకారులు ఇలాగే ముందుకు రావాలని.. వాళ్ళకి ఎల్లప్పుడు మా మద్దతు ఉంటుందని అన్నారు. అలాగే తెలంగాణ నేపథ్యంతో వస్తున్న ఇలాంటి చిత్రాలకు ప్రభుత్వం నుండి సహకారం ఖచ్చితంగా లభిస్తుందని, ఎన్నో వాస్తవిక సంఘటనలను జోడించి తీసిన ఈ దక్కన్ సర్కార్ సినిమాకు కూడా మా తరఫున సపోర్ట్ అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సినిమా నిర్మాత, దర్శకుడు కళా శ్రీనివాస్, హీరో చాణక్య, అసోసియేట్ డైరెక్టర్ వీరేంద్ర గోబీదేశీ, ఇతర సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.



## గ్రామ శాఖ అధ్యక్షుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పెరుక మహేష్ తండ్రి పెరుక లచ్చయ్య ఆదివారం రోజున అనారోగ్యంతో చనిపోగా, మృతునికి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ పూలమాల వేసి, నివాళులర్పించినారు. అనంతరం మృతికి గల కారణం తెలుసుకొని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ మండల కో–ఆప్షన్ సభ్యులు మహ్మద్ ఆజ్జు, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, మాజీ ఎంపీటీసీ మమత–సుజన్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ బత్తిని కమల్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కన్నం సాగర్, నాయకులు ముగ్దం రవి, బోయిని రాజు, తదితరులు ఉన్నారు.

# రైతు సంబంధిత పథకాలకు లక్ష కోట్లకు పైగా వ్యయం..

- రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- మూడు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల:**

ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని, వారి సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తుందని,20 నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ. లక్ష కోట్లకు పైగా రైతు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చించిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడ అర్బన్ మండలం నాంపల్లిలోని లక్ష్మీ నరసింహ కాటన్ ఇండస్ట్రీస్, సంకేపల్లిలోని లక్ష్మీ ఇండస్ట్రీస్, కోనరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శ్రీ కావేరి కాటన్ ఇండస్ట్రీస్ సీసీఐ కొనుగోలు కేంద్రా లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని పత్తి రైతులకు ఇబ్బందులు కలుగకుండా, మద్దతు ధర వచ్చేలా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో మాట్లాడడంతో స్థానికంగా సీసీఐ కొనుగోలు కొనసాగిస్తున్నారని అన్నారు.

జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో ఐదు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, వేములవాడ పరిధిలో రెండు, కోనరావుపేట మండలంలో ఒకటి, ఇల్లంత కుంట మండలంలో రెండు ఉన్నాయని అన్నారు. రైతులు తమ సమీపంలోని ఆయా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించి మద్దతు పొందాలని పిలుపు నిచ్చారు.పత్తి నాణ్యత ఆధారంగా క్వింటాలుకు రూ. 7689 నుంచి 8110 మద్దతు ధర ఉందని అన్నారు. 20 వేల కోట్లకు పైగా రుణమాఫీ రైతులకు చేసిందని తెలిపారు. సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాలకు అదనంగా రూపాయల 500 అందజేస్తుందని అన్నారు. ఇప్పటికే జిల్లాలోని ఆయా మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు దాన్యం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు చేయాలని అన్నారు.

ఈ ప్రాంత సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలోని కాలువలు ఇతర పనులు పూర్తి చేసేందుకు దాదాపు 300 కోట్లు పైగా ప్రజా ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం శంకుస్థాపన చేశారని, పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు .ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఈ ఏడాది 46 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారని, జిల్లాలో 5 లక్షలకు పైగా క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని అన్నారు.కపాస్ కిసాన్‌లో రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. సీసీఐ, మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో రైతులకు వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు రొండి రాజు, కచ్చకాయల ఎల్లయ్య, వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, సీసీఐ సీపీఓ రఘురామ్ తహసీల్దార్లు విజయ్ ప్రకాశ్ రావు, వరలక్ష్మీ, ఎంపీడీఓలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 23 ఫిర్యాదులు స్వీకరణ..
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే తెలిపారు. గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 23 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాల దాడి అప్రజాస్వామికం..

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

భద్రాద్రి జిల్లాలోని ములుగు-గూడూరు ప్రాంతంలో గల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిని దుర్మార్గమని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడికి పాల్పడ్డ వారిపై తక్షణమే దర్యాప్తు జరిపి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిలుపునివ్వనట్లు ప్రకటించారు. సోమవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ లో బి.ఆర్.ఎస్. పార్టీకి అన్ని సర్వేలూ అనుకూలంగా వచ్చిన సమయంలో కాంగ్రెస్ గుండాలు అమర్యాదపూర్వక చర్యలు చేపట్టడం అంగీకరించలేమని అన్నారు. కార్యాలయంలోని కార్యకర్తలపై దాడులు చేయడం సిగ్గుపరచే సంఘటన అని పేర్కొంటూ, హక్కుల కోసం, ప్రజల కోసం నిలబడే మా సంకల్పాన్ని ఎలాంటి భౌతిక దాడులు కూడా వంచలేవని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడికి పాల్పడ్డ వారిపై తక్షణమే దర్యాప్తు జరిపి కఠిన శిక్షించాలని ఆయన రాష్ట్ర




ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి అనవసర దాడులు రాజకీయ పరిణామాలను శాసించలేవు అని గుర్తించి, బాధితులకు న్యాయం జరిగేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎస్కే ఆప్రోచ్, వడ్లూరి వేణు, సిరిమల్లె హరీష్, సంపత్, కనకయ్య, రమేష్, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.



# ఎల్లారెడ్డిపేటలో వైభవంగా శ్రీ వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవం..

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి కళ్యాణ మహోత్సవం సోమవారం రోజున వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మరియు జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న కృష్ణారెడ్డి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇలాంటి ధార్మిక కార్యక్రమాలలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేణుగోపాల స్వామిని కోరుకున్నానని తెలిపారు. ఈ వేడుకలో గుండారపు కృష్ణారెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు, అభిమానులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.



# లక్కీడ్రాలో అదిరే అదృష్టం..!

- రూ.500 కే రూ.16 లక్షల ప్లాట్ గెలుచుకున్న వ్యక్తి

**బలగం టీవీ, యాదాద్రి భువనగిరి**

తన 10 నెలల కూతురు హన్సిక పేరు మీద వేసిన కేవలం రూ.500 విలువైన కూపన్, శంకర్ అనే వ్యక్తికి ఊహించని అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. లక్కీ డ్రాలో ఏకంగా రూ.16 లక్షల విలువైన ప్లాట్‌ను గెలుచుకుని శంకర్ సంతోషంలో మునిగిపోయాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రానికి చెందిన రామ్ బ్రహ్మాచారి అనే వ్యక్తి, తన ప్లాట్ అమ్ముడు పోకపోవడంతో, లక్కీ డ్రా పద్ధతిలో విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ ప్లాట్ ధర రూ.16 లక్షలు కాగా, ఒక్కో లక్కీ డ్రా కూపన్ ధరను కేవలం రూ.500గా నిర్ణయించారు. ఈ డ్రాలో చౌటుప్పల్‌కు చెందిన శంకర్ అనే వ్యక్తి తన కుటుంబంలోని నలుగురి పేరిట కూపన్లు కొనుగోలు చేశాడు. ఇటీవల లక్కీ డ్రా తీయగా, శంకర్ యొక్క 10 నెలల కూతురు హన్సిక పేరు మీద ఉన్న కూపన్‌కు బహుమతి తగిలింది. దీంతో, కేవలం రూ.500 ఖర్చుతో 66 గజాల విలువైన ప్లాట్‌ను శంకర్ గెలుచుకున్నాడు. ఈ విషయంపై శంకర్ తీవ్ర సంతోషం వ్యక్తం చేస్తూ, తన కూతురి అదృష్టం తమకు కలిసివచ్చిందని ఆనందం వ్యక్తం చేశాడు.



# ఘనంగా 'స్టూడెంట్ లెడ్ కాన్ఫిరెన్స్'

- విద్యానగర్ నారాయణ పాఠశాల

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని స్థానిక విద్యానగర్ నారాయణ పాఠశాలలో సోమవారం రోజున 'స్టూడెంట్ లెడ్ కాన్ఫిరెన్స్' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికి తీసి, వారిలోని ప్రతిభను మరింత మెరుగుపరచడానికి ఈ ఎస్ఎల్‌సీ కార్యక్రమం ఒక చక్కటి వేదికలాగా తోడ్పడుతుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల యొక్క కమ్యూనికేషన్ స్కిల్స్ (సంభాషణ నైపుణ్యాలు) గణనీయంగా మెరుగుపడతాయని అన్నారు. ఇటువంటి అద్భుతమైన కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నందుకు నారాయణ పాఠశాలల యాజమాన్యానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని అద్భుతమైన కార్యక్రమాలతో విద్యార్థులు, తల్లిదండ్రుల ముందు ఉంటామని గోపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం గోపాల్ రెడ్డి తో పాటు, డీజీఎం వెంకటరమణారెడ్డి, ఏజీఎం చైతన్య రావు, ఆర్ఐ చీటీ సత్యం రావు, ప్రిన్సిపల్ శాంతి కిరణ్, అకాడమిక్ డీన్, వైస్ ప్రిన్సిపాల్స్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డిసెంబర్ 19 నుంచి హైదరాబాద్‌లో

# అంతర్జాతీయ లఘుచిత్రోత్సవం



బలగం టీవీ, హైదరాబాద్

వచ్చేనెల19 నుంచి 21 వరకు హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమాక్స్‌లో హైదరాబాద్ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవం ఉత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన లోగోను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవం ఛీఫ్ ప్యాట్రన్ జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ దర్శకులు సి ఉమా మహేశ్వరరావు, లఘు చిత్రోత్సవ నిర్వాహకులు దాదా సాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిలిం స్టడీస్ ప్రిన్సిపల్ నందన్ బాబు, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ లఘుచిత్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశవ్యాప్తంగా పలు చలన చిత్రోత్సవాలు జరుగుతు న్నా ఈ స్థాయిలో అంతర్జాతీయ లఘు చిత్రోత్సవం నిర్వహించడం పట్ల గవర్నర్ నిర్వాహకులను అభినందించారు. హైదరాబాద్ సంస్కృతి సంప్రదాయాలకు ఈ లోగో దర్పణం పడుతోందని ఆయన ప్రశంసించారు. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో హైదరాబాద్‌కు విశేషమైన స్థానం ఉందన్నారు. ఈ లఘుచిత్రోత్సవాల ద్వారా నగరం కొత్తదనాన్ని సంతరించుకోవాలని ఆయన ఆకాంక్షిం చారు. దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యల గురించిన ప్రాథమిక అవగాహన కల్పించేందుకు లఘుచిత్రాలు కీలకమైన సాధనంగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ దేశంలో ఈ స్థాయిలో లఘుచిత్రాలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేకంగా మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించటం ఇదే మొదటి సారి అని చెప్పారు. రానున్న కాలంలో హైదరాబాద్ ను అంతర్జాతీయ చలనచిత్ర యవనికలో ఓ ప్రాధాన్యత కలిగిన కేంద్రంగా అభివృద్ధి చేయటానికి ఈ లఘుచిత్రోత్సవాలు ఉపయోగపడతాయని అన్నారు. భారదేశంలోనే హైదరాబాద్‌ను చలనచిత్ర హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చలన చిత్ర అభివృద్ధి సంస్థ నిర్విరామంగా కృషి చేస్తోందని వివరించారు. దేశంలోనే అత్యధిక సంఖ్యలో పిలిం స్క్రీన్‌లు హైదరాబాద్‌లోనే ఉన్నాయని అన్నారు. ఈ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవాల నిర్వహణలో తెలంగాణ చిలన చిత్ర అభివృద్ధి సంస్థ ప్రధాన భాగస్వామిగా ఉండటం ఎంతో సంతోషించదగ్గ విషయమనీ, ఈ ఉత్సవాలు విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. లఘుచిత్రోత్సవం ఛీఫ్ పాట్రెన్ సి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ వచ్చేనెల 19 నుంచి 21 వరకు నిర్వహించబోతున్న ఈ లఘు చిత్రోత్సవాలు ఆధునిక ప్రపంచ సంస్కృతితో తెలంగాణ సంస్కృతి పెనవేసుకో వడానికి ఓ వేదికగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా సినీ రంగ నిపుణులతో జరిగే ప్యానెల్ చర్చల్లో చలన చిత్ర అభివృద్ధికి సంబంధించిన ఎన్నో విషయాలు చర్చించనున్నట్టు వివరించారు.

# కొల్లూరు 'డబుల్' ఇండ్లల్లో అన్ని వసతులు

- **మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ**
- **సంగారెడ్డి జిల్లా కొల్లూరులో ప్రభుత్వ పాఠశాలకు శంకుస్థాపన**

బలగం టీవీ, హైదరాబాద్



సంగారెడ్డి జిల్లా కొల్లూరు లోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో నివసిస్తున్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ప్రాంగణంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సుమారు లక్ష మంది నివసిస్తున్నారని, దాంతో ఈ ప్రాంతం మినీ హైదరాబాద్‌గా మారిందన్నారు. దాంతో ఇక్కడి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాంట్లో భాగంగా హైదరాబాద్‌లోని వీఎస్టీ పరిశ్రమ సాయంతో సీఎస్ఆర్ ఫండ్స్ కింద రూ.4 కోట్లతో ప్రభుత్వ పాఠశాల ఫేస్ 1 నిర్మాణ పనులకు సోమవారం మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సామాన్య ప్రజలకు విద్యా, వైద్యం సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ నివాసితులకు కావలసిన కనీస వసతులు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అతి త్వరలో పనులు పూర్తిచేస్తాయని అన్నారు. ఈ ప్రాంగణంలో పోలీస్ అవుట్ పోస్ట్, స్ట్రీట్ లైట్లు, సీసీ కెమెరాలు, శ్మశాన వాటిక, ప్రార్థనా మందిరాలు, ఆర్టీసీ బస్టాండ్, ప్రహరీ గోడ నిర్మాణం, రెండు అంబులెన్సులు, ఆరోగ్య కేంద్రం, రేషన్ దుకాణాలను త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇక్కడ నివసించే పిల్లల సౌకర్యార్థం సుమారు రూ.7 కోట్లతో నూతన పాఠశాలను రెండు ఫేస్‌ల కింద నిర్మించనున్నామని అన్నారు. 60 తరగతి గదులు, అంగన్వాడీ కేంద్రం, డైనింగ్ హాల్ సౌకర్యంతో ఆధునిక పాఠశాలను నిర్మించనున్నట్టు తెలిపారు. మొదటి దశలో సుమారు రూ.4 కోట్లతో 30 క్లాస్ రూమ్‌లు, ఆటస్థల నిర్మాణం పనులు ప్రారంభిస్తున్నామన్నారు. అనంతరం వీఎస్టీ పరిశ్రమ ప్రతినిధులను మంత్రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, రాష్ట్ర హౌసింగ్ సెక్రటరీ గౌతమ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఈ కార్యక్రమానికి గైర్హాజరవడం చర్చనీయాంశంగా మారింది.

# 28న 'ఆంధ్రా కింగ్ తాలూకా' విడుదల

బలగం టీవీ, హైదరాబాద్



యూత్‌ఫుల్ ఎనర్జీతో ఎప్పుడూ ప్రేక్షకులను అలరిస్తూ ఉండే హీరో రామ్ పోతినేని మరోసారి భారీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో రాబోతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా' ఈనెల 28న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. 'మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేం మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తుండగా, ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ప్రారంభంలో '%క్ష్మాూాఉ%22' పేరుతో ప్రకటించిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు అధికారిక టైటిల్‌తో అభిమానుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించనున్నారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

**మ్యూజిక్‌లో చంద్రబోస్-రామ్ టీంతో వైరల్ సెల్ఫీ**

సినిమా నిర్మాణాంతర పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ క్రమంలో మ్యూజిక్ కార్యక్రమాల్లో ప్రముఖ గీతరచయిత చంద్రబోస్ పాల్గొన్నారు. రామ్ అండ్ టీం చంద్రబోస్‌తో కలిసి దిగిన సెల్ఫీని సోషల్ మీడియాలో షేర్ చేయగా, అది నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమాలో రామ్ "ఆంధ్రా కింగ్ సూర్యకుమార్" అభిమానిగా కనిపించనున్నాడు. రిలీజ్ గ్లింప్స్‌లో రామ్ తన అభిమాన హీరో స్టైల్‌లో థియేటర్‌లోకి ఎంట్రీ ఇచ్చి, "ఆంధ్రా కింగ్ ఫ్యాన్స్ తాలూకా యాభై టిక్కెట్లు ఇవ్వండి!" అంటూ చెప్పే సీన్ ప్రేక్షకులలో మంచి బజ్ సృష్టిస్తోంది. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. సంగీత దర్శకులుగా వివేక్-మెర్విన్ ఈ చిత్రంతో టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు.

# కేరళ స్టేట్ ఫిలిం అవార్డ్స్‌లో దుమ్మురేపిన 'మంజుమ్మెల్ బాయ్స్'

- **పది విభాగాల్లో అవార్డులు గెలుచుకున్న సర్వైవర్ థ్రిల్లర్**
- **ఉత్తమ నటుడిగా మమ్ముట్టి**

బలగం టీవీ, త్రిస్సూర్

ఎటువంటి అంచనాలు లేకుండా విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకున్న మలయాళ చిత్రం 'మంజుమ్మెల్ బాయ్స్' మరోసారి వార్తల్లో నిలిచింది. చిదంబరం దర్శకత్వంలో రూపొందిన ఈ సర్వైవర్ థ్రిల్లర్ 2024 ఫిబ్రవరి 22న విడుదలై బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. ఇప్పుడు కేరళ ప్రభుత్వం ప్రకటించిన 55వ కేరళ స్టేట్ ఫిలిం అవార్డ్స్‌లో ఘనవిజయం సాధించి రికార్డులు తిరగరాసింది.త్రిస్సూర్‌లో మంత్రి సాజీ చెరియన్ ప్రకటించిన వివరాల ప్రకారం, 'మంజుమ్మెల్ బాయ్స్' మొత్తం 10 విభాగాల్లో అవార్డులు గెలుచుకుంది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ సహాయ నటుడు సహా పలు విభాగాల్లో ఈ చిత్రం ఆధిపత్యం చాటుకుంది.

**అవార్డుల జాబితా**

ఉత్తమ చిత్రం: మంజుమ్మెల్ బాయ్స్
ఉత్తమ దర్శకుడు: చిదంబరం
ఉత్తమ స్క్రీన్‌ప్లే: చిదంబరం
ఉత్తమ సహాయ నటుడు: సౌబిన్ షాహిర్
ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్: అజయన్ చలిస్సెరి
ఉత్తమ సినిమాటోగ్రఫీ: శైజు ఖలీద్
ఉత్తమ సౌండ్ డిజైన్: షిజిన్, అభిషేక్
ఉత్తమ సౌండ్ మిక్సింగ్: ఫజల్, షిజిన్
ఉత్తమ లిరిసిస్ట్: వేదాన్
ఉత్తమ కలరిస్ట్: స్రిక్ వారియర్
ఉత్తమ నటుడిగా మమ్ముట్టి





'భ్రమయుగం' చిత్రంలోని అద్భుత నటనకు గాను మలయాళ మెగాస్టార్ మమ్ముట్టికి ఈ ఏడాది ఉత్తమ నటుడు అవార్డు దక్కింది. కేరళ సినీ పరిశ్రమలో ఆయన మరోసారి తనదైన ముద్ర వేసుకున్నారు. మలయాళం, తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో విడుదలైన 'మంజుమ్మెల్ బాయ్స్' అన్ని భాషల ప్రేక్షకులను ఆకట్టుకుంది. థ్రిల్లర్, ఎమోషన్, స్నేహం మేళవింపుతో ఈ చిత్రం మలయాళ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కొత్త అవతారంలో రష్మిక మందన్నా

- **'మైసా' షూటింగ్ ప్రారంభం**

బలగం టీవీ, హైదరాబాద్




రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మైసా' షూటింగ్ అధికారికంగా ప్రారంభమైంది. ఈ ప్రాజెక్ట్ పట్ల అభిమానుల్లో నెలలుగా నెలకొన్న ఆసక్తికి ముగింపు పలుకుతూ, కేరళలోని అథిరప్పిల్లీ వద్ద నేడు క్లాప్ కొట్టారులిలి. ఈ సినిమాలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళ పాత్రలో నటించనుందట. ఇప్పటికే విడుదలైన లిలిఫస్ట్ లుక్ పోస్టర్‌లిలి నెట్టింట వైరల్ అవుతూ, రష్మికను ఇంతవరకు చూడని ఓ కొత్త అవతారంలో చూడబోతున్నామన్న ఆసక్తిని పెంచింది.మైసా' చిత్రంతోరవీంద్ర పుల్లేలిలి దర్శకుడిగా పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నారు. లిలిఅన్‌ఫార్ములా ఫిల్మ్స్‌లిలి బ్యానర్‌పై ఈ చిత్రం నిర్మితమవుతోంది. సంగీతాన్ని లిలిజేక్స్ బిజోయ్‌లిలి సమకూరుస్తుండగా, ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా అందిస్తున్నారు.

ఈ చిత్రంలో 'పుష్ప 2' విలన్‌గా నటించిన తారక్ పొన్నప్ప కూడా ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నాడు. ఇది రష్మికతో ఆయనకు రెండో సినిమా.'కల్కి 2898 ప్రాజెక్ట్‌కు పనిచేసిన ప్రముఖ స్టంట్ మాస్టర్ ఆండీ లాంగ్ గ్యుయె ఈ చిత్రానికి యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. దీంతో ఈ సినిమా యాక్షన్ సీక్వెన్స్‌లు అంతర్జాతీయ స్థాయిలో ఉండనున్నాయని ఇండస్ట్రీ టాక్. 'పుష్ప'లో శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో అలరించిన రష్మిక మందన్నా, ఇప్పుడు 'మైసా' లో గిరిజన మహిళగా ఎలా మెప్పించబోతుందన్నది సినీ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది.

# 'ది ప్యారడైజ్'లో నానికి తల్లిగా సోనాలి కులకర్ణి

బలగం టీవీ, హైదరాబాద్




'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్ (%ుఎజు్రాూక్మ-ాణక్ష్మ్రాజు%)'. ఈ చిత్రంలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన మోహన్ బాబు లుక్ సోషల్ మీడియాలో హల్‌చల్ సృష్టించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్ర బృందం మరో ఆసక్తికర అప్‌డేట్‌తో అభిమానుల్లో కొత్త జోష్ నింపింది. ఈ సినిమాలో నేషనల్ అవార్డ్ విన్నర్ సోనాలి కులకర్ణి నాని తల్లిగా కనిపించనున్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేస్తూ, "తల్లి గళం మనసును కదిలిస్తుంది" అంటూ శుభాకాంక్షలు తెలిపారు. గ్లింప్స్‌లో ఆమె వాయిస్ ఇప్పటికే ఇంటర్నెట్‌లో వైరల్ అవుతూ, సినిమాపై అంచనాలు పెంచేస్తోంది.

'ది ప్యారడైజ్' సోనాలి కులకర్ణి నటిస్తున్న తొలి తెలుగు చిత్రం కావడం విశేషం. పూణేకు చెందిన ఈ నటి మరాఠీ, హిందీ, గుజరాతీ, ఇంగ్లీష్, ఇటాలియన్ సినిమాల్లో పలు పాత్రలు పోషించారు. ఆమెని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ సారె ఎలా ప్రదర్శించబోతున్నాడన్నది సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. ఈ చిత్రానికి సంగీతం అనిరుధ్ రవిచందర్ సమకూరుస్తున్నారు. 'జెర్సీ', 'గ్యాంగ్ లీడర్' తర్వాత నాని %-% అనిరుధ్ కాంబో మళ్లీ రాబోతోంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో పాటు పాటల విషయంలోనూ భారీ అంచనాలు ఉన్నాయి.సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది.